క్లుప్తంగా

శ్రావ్యంగా గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న సుమిత్ర వాసుదేవ్

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం గాత్ర కచేరీ నిర్వహించారు. చెన్నైకు చెందిన విదుషీమణి డాక్టర్ సుమిత్ర వాసుదేవ్ శ్రావ్యానందకరంగా కచేరీ చేశారు. కార్యక్రమంలో ప్రతి ఏటా అందించే భారతరత్న సుబ్బలక్ష్మి స్మారక పురస్కారాన్ని ఈ ఏడాది ఆమెకు అందించి సత్కరించారు. అకాడమీ అధ్యక్షుడు కె.వి.రామమూర్తి, ఉపాధ్యక్షులు రాజారావు, డాక్టర్ పేరాల బాల మురళి, గౌరవ కార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి, దుర్గాప్రసాద్‌ల చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. అనంతరం రాంభట్ల కుటుంబ సభ్యులు వారి తల్లిదండ్రులు రాంభట్ల కృష్ణారావు, బాలాత్రిపురసుందరి సంస్మరణ పురస్కార నగదును సుమిత్ర వాసుదేవ్‌కు బహూకరించారు. సభా కార్యక్రమానంతరం సుమిత్ర గాత్ర సంగీత కచేరీకి మంథా రమ్య వాయులీనంపై, ధన్వాడ ధర్మారావు మృదంగంపై, సరస్వతుల హనుమంతరావు ఘటంపై సహకరించారు. గాత్ర కచేరీ కార్యక్రమం సభికులను ఆద్యంతం అలరించింది.

కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోకు అభినందన



మెహర్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టిన జి.మెహర్‌కుమార్‌ను కేజీహెచ్ వైఎస్సార్ టీయూసీ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు నేతృత్వంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందించారు. రాజారావు, అప్పలస్వామి, ఎస్కే బేగం , సిహెచ్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎన్.నాగమణి, తులసి పాల్గొన్నారు.

నేషనల్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: వైజాగ్ షార్ట్‌ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న నేషనల్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అస్రాఫ్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అనేక షార్ట్‌ఫిల్మ్ మేకర్స్ కోసం తాము నిర్మించిన చిత్రాన్ని ప్రదర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని తమ చిత్రాన్ని ప్రదర్శించుకోవాలని, ప్రతి సినిమాకు అవార్డు బహూకరిస్తామన్నారు. కార్యదర్శి ఎల్లాజీ మాట్లాడుతూ ఇప్పటికే 20కి పైగా షార్ట్‌ఫిల్మ్ ఎంట్రీలు వచ్చాయని, ఈ నెల 30 వరకు 2 నుంచి 15 నిమిషాల నిడివి గల లఘు చిత్రాలు vizagshortfilmmaker@gmail.comకు పంపించాలని తెలిపారు. వివరాలకు 89193 47875 నంబర్‌లో సంప్రదించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో సంతోష్, శంకర్, రావి పట్నాయక్, కృష్ణ, వెంకటరమణ, ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ హిందీ ప్రేమీ మండలి పోటీలు

తగరపువలస: 71వ జాతీయ హిందీ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర భాష హిందీ ఎందుకు నేర్చుకోవాలనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో తెలుగు మీడియంలో 18 మంది, హిందీలో 76 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాస పోటీల్లో 16 మంది, చిత్రలేఖనం పోటీల్లో 32 మంది పాల్గొన్నారు. మిగిలిన పద్యపఠనం, వేషధారణ పోటీలు త్వరలో నిర్వహించనున్నట్లు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

మళ్లీ మొదటికి..!

- శివాజీ పార్కు రోడ్డులో యథేచ్ఛగా ఆక్రమణలు
- ఫుట్‌పాత్‌లపై వెలుస్తున్న దుకాణాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, పాదచారులు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల గోడను ఆనుకొని ఫుట్‌పాత్‌పై ఇటుకలు, పిక్క, ఇసుక



శివాజీ పార్కు రోడ్డులో ఫుట్‌పాత్‌పై వెలసిన అనధికార దుకాణాలు

ఎంవీపీకాలనీ: పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. లక్షలు రూపాయలు వెచ్చించి రహదారులకు ఇరువైపులా సర్వాంగ సుందరంగా కాలిబాటలు తీర్చిదిద్దారు. వాటిని కొందరు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో పాదచారులు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. తాజాగా శివాజీ పార్కు రోడ్డులో ఇరువైపులా ఫుట్‌పాత్‌పై యథేచ్ఛగా వెలసిన దుకాణాలే ఇందుకు నిదర్శనం . ఈ మార్గంలో ఫుట్‌పాత్‌లు, రోడ్డును గత ప్రభుత్వం అందంగా తీర్చిదిద్దింది. ఆ సమయంలో ఆక్రమణలను సైతం తొలగించారు. ఆధునికీకరించిన ఈ రహదారిలోని ఫుట్‌పాత్‌లపై మళ్లీ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈ సమస్యపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం స్పందించకపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.



రోడ్డును ఆనుకొని కార్ల పార్కింగ్

గత ప్రభుత్వంలో ఆధునికీకరణ

రామలక్ష్మి అపార్ట్‌మెంట్ కూడలి నుంచి జాతీయ రహదారి వరకు శివాజీ పార్కు రోడ్డు విస్తరించి ఉంది. ఈ మార్గంలో ఫుట్‌పాత్‌లు, డివైడర్లు, ఇరువైపులా రహదారి ఆధునికీకరణను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవీఎంసీ స్మార్ట్ సిటీ వర్క్స్ ద్వారా రూ.1.40 కోట్ల నిధులతో చేపట్టింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు పూర్తి స్థాయిలో ఈ రోడ్డును వినియోగించుకుంటున్నారు.

విచ్చలవిడిగా వ్యాపారాలు

కొంతకాలంగా ఈ మార్గంలోని ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా ఆక్రమణలు పెరిగిపోవడంతోపాటు రోజుకో దుకాణం పుట్టుకొస్తున్నాయి. ఈ రోడ్డులో ఆంధ్రా యూనివర్సిటీ ప్రహరీ గోడను ఆనుకొని పెద్ద ఎత్తున వాహనాలు పార్క్‌చేసి వదిలేస్తున్నారు. కొందరు ఇటుకలు, ఇసుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి విక్రయాల డంప్‌లు ఇక్కడే నిర్వహిస్తున్నారు. వీటిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో గత పరిస్థితి ఇక్కడ పునరావృతం కావడంతో స్థానికులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకుని రహదారులు, ఫుట్‌పాత్‌లను ప్రజా సేవలకు అనుగుణంగా ఉంచాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై మండిపడుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించాలని, రహదారుల్లో వాహనాల పార్కింగ్‌ను నిరోధించాలని కోరుతున్నారు.

ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం



శివాజీ పార్కు రోడ్డులో గత ప్రభుత్వం ఆక్రమణలను తొలగించి రహదారితోపాటు ఫుట్‌పాత్‌లను ఆధునికీకరించింది. దీంతో చాలా కాలంగా ఈ మార్గంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. కొంతకాలంగా ఇక్కడి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, షాపుల ఏర్పాటు జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులకు 6 సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

– కొయ్య రామకృష్ణ, 20వ వార్డు

‘మనోవైద్య శతకం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ భాగ్యారావు, రచయిత విజయగోపాల్, ప్రముఖ వైద్యులు

మహారాణిపేట: డాక్టర్ విజయగోపాల్ రచించిన మనోవైద్య శతకం పుస్తకం వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి అన్నారు. ఈ శతకంలో ఉన్న రెండు గేయాలను పాడి వినిపించారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్(విశాఖపట్నం) ఆధ్వర్యంలో చినవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాల ఆవరణలో ఆదివారం మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మోపిదేవి విజయగోపాల్ మానసిక సమస్యలు, వ్యాధులు ఇతివృత్తంగా రచించిన మనోవైద్య శతకం పుస్తకావిష్కరణ సభ జరిగింది. రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ జి.భాగ్యారావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల్లో కూడా రచయితలు ఉన్నారని, ఆ రెండు కలిపితే డాక్టర్ విజయగోపాల్ అని కొనియాడారు. అన్ని రకాల మానసిక సమస్యలను పద్యాలు, ఛందస్సు రూపంలో ఇందులో పొందుపరిచారని, ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సైకియాట్రీ సొసైటీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ జి.వి.ఎస్.మూర్తి, సైకియాట్రిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సూర్యారావు, డాక్టర్ ఎం.మోహనరావు, డాక్టర్ మల్లికార్జునయ్య, డాక్టర్ తేజస్వి, డాక్టర్ లోకేశ్వరరెడ్డి, డాక్టర్ మల్లిక, అనంతరామయ్య, డాక్టర్ నరసింహారెడ్డి, దామరాజు విశాలాక్షి, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ చందన వందన సమర్పణతో సభ ముగిసింది.

బ్రహ్మకుమారీస్ సంస్థ సేవలు అమోఘం



మౌంట్ అబూ యాత్రను ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి రామేశ్వరి

మద్దిలపాలెం: బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘమని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మానసిక వికాసాన్ని పొందగలరని సంస్థ ప్రతినిధి రామేశ్వరి అన్నారు. హెచ్‌బీ కాలనీలోని బ్రహ్మకుమారీస్ సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం విశాఖపట్నం నుంచి మౌంట్ అబూ యాత్రను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఈ నెల 26 నుంచి రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబూలో జరగనున్న జాతీయ మీడియా సదస్సును విశాఖ జర్నలిస్టులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సులో న్యాయమూర్తులు, మీడియా ప్రతినిధులకు పలు అంశాలపై సెషన్లు, వర్క్‌షాప్‌లు, రాజయోగా ధ్యానం తదితర క్లాసులు జరుగుతాయన్నారు. జర్నలిస్టులు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఆధ్యాత్మిక యాత్రలు ఎంతో దోహదపడతాయన్నారు. పవిత్ర పుణ్య క్షేత్రం మౌంట్ అబూ యాత్ర ద్వారా జర్నలిస్టుల్లో స్థిమితం వస్తుందని చెప్పారు. జాతీయ మీడియా సదస్సుకు దేశం నలుమూలలా నుంచి వచ్చే జర్నలిస్టుల పరిచయంతో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 24న విజయనగరంలో మీడియా ప్రతినిధుల బృందం రైలులో రాజస్థాన్‌కు బయలు దేరుతుందని తెలిపారు. సదస్సులో పాల్గొనే జర్నలిస్టులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విశాఖ నుంచి పలువురు జర్నలిస్టులు ఈ యాత్రకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, వీరభద్రరావు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు బాబ్జీ, సునీత, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్ల ఆపరేషన్లపై యువ వైద్యులకు అవగాహన



ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిని సత్కరిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: ఇండియన్ ఆర్థోస్కోపీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఐఏఎస్ వన్ మోకాళ్ల ఆర్థోస్కోపీ సదస్సు నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. అత్యంత క్లిష్టమైన మోకాళ్ల ఆపరేషన్లను వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రి నుంచి లైవ్ ద్వారా సదస్సులో పాల్గొన్న యువ వైద్యులు వీక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డాక్టర్ అమీన్ రజని(ముంబై), డాక్టర్ సందీప్ బిరరిస్ (ముంబై), డాక్టర్ ప్రహ్లాద్ కుమార్ సింఘి(మధురై)లు మూడు రకాలుగా మోకాళ్ల ఆపరేషన్లపై లైవ్ సర్జరీస్ ద్వారా అవగాహన కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు సెషన్స్‌గా ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను అతిథులు సత్కరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది ఆర్థోపెడిక్ వైద్యులు, 'ఐఏఎస్ వన్' ఆర్గనైజింగ్ కమిటీ డాక్టర్ పి.శివానంద, డాక్టర్ అస్లాం ఆరిఫ్, డాక్టర్ శ్రీధర్ గంగవరపు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, మెడికవర్ ఆస్పత్రి ఏపీ రీజినల్ డైరెక్టర్ ఎస్.పద్మజ, సెంట్రల్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర బెండి తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్

- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు
- రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి వేలిముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుతం తీరు మార్చుకోని వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొందరు రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేశారని, ప్రస్తుతం ఎవరైనా హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, ఏఎస్ఐ డి.వి.రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యంతోనే శాంతిస్థాపన



శాంతి సదస్సులో పాల్గొన్న మయన్మార్ విద్యార్థులు తదితరులు

సీతంపేట: అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఫ్రీడం ఫర్ రెలీజియస్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో 'శాంతి -అభివృద్ధి' అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు సర్వమత ప్రార్థన చేశారు. ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ మత సామరస్యంతోనే శాంతిస్థాపన సాధ్యమన్నారు. అభివృద్ధి సాధించాలంటే అన్ని దేశాలు శాంతిని పాటించాలన్నారు. నేడు అన్ని దేశాలు న్యూక్లియర్ బాంబులు కలిగి ఉన్నాయని, రక్షణకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తూ, సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించాల్సిన పరిస్థితి ఉందన్నారు. సకల జంతు జాలాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన ఆయుధాలు లేని ప్రపంచాన్ని చూడాలని, ఆ విధంగా భావితరాలు శాంతియుతమైన సమాజాన్ని వారసత్వంగా పొందగలరని ఆశిద్దామని తెలిపారు. సమావేశంలో బ్రహ్మకుమారి బి.కె.కామేశ్వరి, ఏయూ తెలుగు ఆచార్యులు వెంకటేశ్వర యోగి, మయన్మార్ విద్యార్థులు రాజా దామా, కోన వెంకటరావు, ఉషారాణి, హరగోపాల్ పాల్గొని శాంతి ప్రతిజ్ఞ చేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

ముగిసిన చండీ సహిత సుదర్శన యాగం



యాగంలో చండీ మాతకు పూజలు చేస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ఆరిలోవ: లోక కల్యాణార్థం బాలభాను అర్చక, పురోహిత సంఘం చేపట్టిన చండీ సహిత సుదర్శన యాగం ఆదివారంతో ఘనంగా ముగిసింది. తోటగరువు దరి ఎర్నిదుర్గమాంబ ఆలయ ఆవరణలో ఈ నెల 18న యాగం ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి రోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, తులసీరాధన, సూర్య నమస్కారాలు, చండీ పారాయణం, చండీ హోమం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి పలు దేవతా కల్యాణాలు జరిపించారు. ఈ నెల 18న సీతారామ కల్యాణం, 19న వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణం, 20న శివపార్వతుల కల్యాణం, 21న శ్రీనివాసుడి కల్యాణం, 22న సూర్యనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు రేజేటి శ్రీరామాచార్యులు, సుసరాపు చంద్రశేఖర శర్మ, జోష్యుల గోపాలశర్మ సమక్షంలో యాగం చేశారు.

చండీ మాతకు సీపీ పూజలు

సుదర్శన యాగం ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని చండీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చక సంఘం సభ్యులు సాదర స్వాగతం పలికారు. పూజల అనంతరం సీపీని ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు జోష్యుల కామేశ్వరశర్మ, కార్యదర్శి మావుదూరు కిశోర్‌శర్మ, వ్యవస్థాపకుడు వెంకటరమణ శర్మ మాట్లాడుతూ ఈ యాగంలో భక్తులను భాగస్వాములను చేశామన్నారు. వందల మంది బ్రాహ్మణ కుటుంబీలకుతోపాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు దేవతల కల్యాణంలో పాల్గొన్నారని చెప్పారు.

కంబాలకొండలో ‘స్వచ్ఛతా హీ సేవా’



కంబాలకొండలో చెత్త తొలగిస్తున్న పోర్ట్ అథారిటీ అధికారులు



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాలల విద్యార్థులు

ఆరిలోవ: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో ఆదివారం కంబాలకొండలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వీపీఏ అధికారులు, సిబ్బంది, జిల్లా అటవీ శాఖ అధికారులు నగరంలోని పలు క్రీడా పాఠశాలల విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఇక్కడ చెత్త తొలగించి శుభ్రం చేశారు. విద్యార్థులతో కలిసి అధికారులు ట్రెకింగ్ నిర్వహించారు. ట్రెకింగ్ దారిలో పేపర్ ప్లేట్లు, పాలిథిన్ కవర్లు తదితర చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వీపీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వీపీఏ చీఫ్ మెడికల్ ఇంజినీర్ హరికృష్ణ, పలువురు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని వినతి



12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణికి వినతిపత్రం అందిస్తున్న అవుట్ సోర్సిగ్ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం తూర్పు నియోజకవర్గం జోన్–2 పరిధిలోని వార్డుల కార్పొరేటర్లకు వినతిపత్రాలు అందజేశారు. 9 నుంచి 13వ వార్డు వరకు కార్పొరేటర్లను కలసి వారి సమస్యలు విన్నవించారు. గతేడాది జూలైలో జీవీఎంసీ కౌన్సిల్‌లో విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.25,140, సెమీ స్కిల్డ్ వర్కర్లకు రూ.29,610 చొప్పున వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రూ.13,000 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. నిత్యావసర సరకుల ధరలు బాగా పెరిగిపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కౌన్సిల్‌లో పెంచిన వేతనాలను అమలు చేయాలని కోరారు. వినతిపత్రాలు అందించిన వారిలో నీటి సరఫరా విభాగం సిబ్బంది శేఖర్, రాజేష్, శ్రీను, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

మూలకు చేరిన వాటర్ ఫౌంటెయిన్లు



ముడసర్లోవ పార్కులో శిథిలమైన వాటర్ ఫౌంటెయిన్



శ్రీకృష్ణుడి విగ్రహంతో ఉన్న వాటర్ ఫౌంటెయిన్

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ పార్కులో సందర్శకులను కనువిందు చేసే వాటర్ ఫౌంటెయిన్లు మూలకు చేరాయి. కొన్నేళ్ల నుంచి శిథిలావస్థకు చేరిన వీటిని జీవీఎంసీ ఉద్యానవనాధికారులు ఇంతవరకు పట్టించుకోకపోవడం విశేషం. కార్తీక మాసంలో వనభోజనాలకు, కుల సంఘాల పిక్నిక్‌లకు, రాజకీయ పార్టీల సమావేశాలకు ఈ పార్కు నిలయంగా మారింది. వీటితోపాటు రోజూ నగరంలో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు. పార్కు ప్రారంభంలో రెండు చోట్ల వాటర్ ఫౌంటెయిన్లు ఏర్పాటు చేశారు. వాటిలో రంగురంగుల నీళ్లు పైకి చిమ్మి పార్కుకు వెళ్లిన సందర్శకులను కనువిందు చేసేవి. ఫౌంటెయిన్ల వద్దే సందర్శకులు ఎక్కువ సమయం గడిపేవారు. వీటిలో ఒక వాటర్ ఫౌంటైన్ మధ్యలో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేశారు.

చుట్టూ నీరు పైకి చిమ్ముతుండగా సందర్శకులు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని దర్శించుకునేవారు. అలాంటి వాటర్ ఫౌంటెయిన్లు వినియోగంలో లేకుండా పోయాయి. వాటి గోడలు శిథిలమయ్యాయి. నీటి సరఫరా జరిగే పైపులు తుప్పుపట్టి విరిగిపోయాయి. వీటికి మరమ్మతులు జరిపించి మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

• గమనించకుంటే ప్రమాదమే..!



బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద గల డివైడర్లపై ఉండాల్సిన పూల మొక్కల కుండీలు రోడ్డు మీద పడి ప్రమాదకరంగా మారాయి. వీటి వల్ల వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరం కిటకిట







బీచ్‌రోడ్డు: విశాఖ సాగర తీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఆహ్లాదకర వాతావరణంలో గడపడానికి ఆర్.కె.బీచ్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చి.. సందడి చేశారు. చిన్నారులు, మహిళలు సముద్రంలో స్నానాలు చేసి ఆనందించగా.. యువతీ యువకులు తీరంలో సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు. భారీగా సందర్శకులు తరలివచ్చిన నేపథ్యంలో బీచ్‌గార్డ్స్ ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ భద్రత కల్పించారు. సందర్శకులు సముద్రంలోకి వెళ్లొద్దని, ప్రమాదకరమైన ప్రదేశాలను దాటవద్దని హెచ్చరించారు.